క్లుప్తంగా

ఓటర్ల జాబితాలు సరిచూసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ వి.వి.రమణ

కురుపాం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పాలకొండ ఆర్డీఓ వి.వి. రమణ సోమవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ..ఓటర్ల జాబితాలను సరిచూసుకోవాలని, తప్పులు, సవరణలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల ధర్నా



ఏపీఓకు వినతిపత్రం ఇస్తున్న సీహెచ్‌డబ్ల్యూలు

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న 2,361 మంది కమ్యూనిటీ హెల్త్‌వర్కర్లను ఆశా కార్యకర్తలుగా మార్చాలని కోరుతూ పలువురు ఉద్యోగులు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావల రమణా రావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు అమ్ము నాయుడు మాట్లాడుతూ, నెలకు పది వేల రూపాయల గౌరవవేతనంతో పాటు టీఏ, డీఏలు చెల్లించాలని కోరారు. అలాగే యూనిఫాం, మెడికల్ కిట్లు అందజేయాలన్నారు. పది లక్షల రూపాయల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏపీఓ రోసిరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయపార్వతిలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సురేష్, కాంతారావు, ఎం.లక్ష్మణరావు, రమణమ్మ, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

గరుగుబిల్లి: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఉపాధిహామీ సిబ్బందిపై చర్యలు తప్పవని ఎంపీడీఓ పి.సూర్యనారాయణ హెచ్చరించారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. వేతనదారులు ఉపాధి పనుల్లో అధిక సంఖ్యలో పాల్గొనేలా వారికి అవగాహన కల్పించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పని ప్రదేశంలో వేతనదారులకు అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులను కల్పించాలని ఆదేశించారు.

కొండచీపుర్ల తయారీపై శిక్షణ



చీపుర్ల తయారీపై అవగాహన కల్పిస్తున్న వెలుగు ప్రతినిధులు

భామిని: మండలంలోని బొడ్డగూడలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివాసీ మహిళలకు కొండచీపుర్ల తయారీపై సోమవారం శిక్షణ ఇచ్చారు. గిరిజనులు సేకరించిన చీపురు పుల్లలను గ్రేడుల వారీగా విభజించి, వాడకానికి అనువుగా చీపురు కట్టల తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ ఈ. తులసీదాస్, వెలుగు ఏపీఎం దొడ్ల భవానీ, గోపాల్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



సుగుణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కళావతి, తదితరులు

పాలకొండ: నగర పంచాయతీలోని నాగవంశపు వీధికి చెందిన ఆనాపు జోగునాయుడుని స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం పరామర్శించారు. ఇటీవల జోగినాయుడు భార్య సుగుణమ్మ మరణించారు. ఈ మేరకు సుగుణమ్మ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శలో కొంచాడ అరుణ, పల్లా భాను, తదితరులున్నారు.

కళాశాలకు కొత్త రూపు



కళాశాల వరకు వేసిన సీసీరోడ్డు



తరగతి గదిలో ఏర్పాటు చేసిన బెంచీలు

పాలకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత కల్పించారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నారు. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన పాలకొండలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు–నేడు కింద సుమారు రూ.1.14 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ కళాశాలలో సుమారు 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కళాశాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడంతో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నాడు–నేడు కార్యక్రమంలో కళాశాల కొత్తరూపు సంతరించుకుంది.

ఆహ్లాద వాతావరణం..

కళాశాలలో అదనపు భవనాల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించారు. కళాశాలకు ఆనుకుని ఉన్న 11 ఎకరాల సువిశాల స్థలం ఆక్రమణకు గురికాకుండా ప్రహరీ నిర్మాణం చేపట్టారు. తరగతి గదుల్లో ఫ్లోరింగ్, బెంచీలు, సురక్షిత తాగునీరు, టాయిలెట్లు నిర్మాణం పూర్తిచేశారు. డిజిటల్ తరగతుల నిర్వహణ కోసం ఒక్కో తరగతి గదిలో రూ.3.50 లక్షల విలువ చేసే స్మార్ట్‌టీవీలను ఏర్పాటు చేశారు. కళాశాల ఆవరణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో ఈ కళాశాలలో చేరేందుకు విద్యార్థులు పోటీపడుతున్నారు.

అన్ని వసతులు కల్పించారు



ప్రభుత్వం నాడు–నేడు పథకంలో భాగంగా కళాశాలలో అన్ని వసతులు కల్పించింది. నిధుల ఖర్చులో ఎక్కడా కాంట్రాక్టరు ప్రమేయం లేకుండా పూర్తి బాధ్యతలను మాకే అప్పగించడంతో పనులు సకాలంలో పూర్తి చేయగలుతున్నాం. ప్రస్తుతం కళాశాలలో అన్ని రకాల లాబ్‌లు, సౌకర్యాలు ఉన్నాయి. అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులు ఉన్నారు. ఇంకా కళాశాలకు రంగులు మాత్రమే వేయాల్సి ఉంది.

– పి.శంకరరావు, ప్రిన్సిపాల్, కళాశాల

అడ్మిషన్ల కోసం పోటీపడుతున్నారు



మా కళాశాలలో ప్రస్తుతం 600 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. పోటీ పరీక్షల్లోనూ మా కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు. వసతులు కల్పించడంతో పాటు నాణ్యమైన బోధన అందిస్తుండడంతో కళాశాలలో ప్రవేశాలు పెరిగాయి. సీట్ల కోసం విద్యార్థులు పోటీపడుతున్నారు.

– వి.అప్పారావు, ఎన్ఎస్ఎస్ అధికారి



ప్రభుత్వ జూనియర్ కళాశాల



మరుగుదొడ్లు



శుద్ధజల ప్లాంట్

వలంటీర్లు ఆత్మబంధువులు

- సత్కారసభలో ఎమ్మెల్యే కళావతి



వలంటీర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: వలంటీర్లు ఆత్మ బంధువులని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నియమించిన వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా నిలిచారని కొనియాడారు. రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని ముందుకు నడిపించే రథసారథులు వీరేనన్నారు. ప్రతి నెలా మొదటి తారీఖు రాగానే తెల్లవారకముందే అవ్వా, తాతలకు పింఛన్లు అందజేస్తున్నారని చెప్పారు. సేవాభావంతో వీరు చేస్తున్న సేవలను గుర్తించి జగనన్న ప్రత్యేక పారితోషికాలు మంజూరు చేస్తూ సత్కరిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు దేశానికే ఆదర్శమన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా మళ్లీ రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అనంతరం విశేష ప్రతిభ కనబరిచిన ఇద్దరు వలంటీర్లకు సేవావజ్ర అవార్డులు ప్రకటించారు. మరోఐదుగురికి సేవారత్న, ఎనిమిది మందికి సేవామిత్ర అవార్డులు అందజేశారు. వీరందరికీ నగదు ప్రోత్సాహకాలు నేరుగా బ్యాంక్ ఖాతాలకు జమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహనరావు, ఎంపీడీఓ కె.గీతాంజలి, ఈఓపీఆర్‌డీ కె.సత్యం, పరిపాలనాధికారి మాస, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కార్యదర్శులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అమూల్యం



కొమరాడ: వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ శెట్టి శ్యామల, తదితరులు

కొమరాడ: గ్రామ వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని ఎంపీపీ శెట్టి శ్యామల అన్నారు. మండలంలోని పూడేస్, పెదశాఖ, నయా, చినఖేర్జిల గ్రామ సచివాలయ పరిధిలో సేవలందిస్తున్న వలంటీర్లను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా ఉంటూ సేవలందిస్తున్న వలంటీర్లను చూసి ప్రతిపక్షాలు భయపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డి.జనార్దనరావు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గరుగుబిల్లి: వలంటీర్లను సత్కరిస్తున్న సర్పంచ్ మహేశ్వరరావు

- గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి గ్రామ సచివాలయం పరిధిలో సేవలందిస్తున్న వలంటీర్లను ఎంపీడీఓ పి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ బి.మహేశ్వరరావు మాట్లాడుతూ.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అర్హులకు చేరవేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. వలంటీర్ల సేవలను గుర్తించి వారిని మరింత ప్రోత్సహించేందుకు వీలుగా ఏటా ప్రభుత్వం సేవా పతకాలతో సత్కరిస్తోందన్నారు. అలాగే మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ కె.ఇందుమతి ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ సేవలందించిన పలువురు వలంటీర్లను సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ 1, 2 యూనిట్లతో పాటు ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం అధ్యక్షతన సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా రాగోలు జేమ్స్ ఆస్పత్రికి చెందిన వైద్యులు డి.దీపిక, వై.భవ్య శిబిరంలో పాల్గొని కళాశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. చర్మ, నేత్ర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న పలువురికి మందులు అందజేశారు. తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ కె.రమేష్, ఎన్ఎస్ఎస్ పీఓలు డి.రామయ్య, త్రినాథ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కోఆర్డినేటర్ డి.శ్రీలక్ష్మీ, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



ఎంపీపీ రామారావును సత్కరిస్తున్న కార్యదర్శులు

గరుగుబిల్లి: గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులకు డీడీఓ అధికారులు కల్పిస్తూ ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడంపై పంచాయతీ కార్యదర్శులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక ఎంపీపీ ఉరిటి రామారావును ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రికి ఎప్పటికీ రుణపడి ఉంటామని కార్యదర్శులు దత్తి సురేష్, సీరస రవికుమార్, అంబటి ప్రసాద్‌రావు, భార్గవ్, దిలీప్ తదితరులు పేర్కొన్నారు.

సాంకేతికతతో కూడిన విద్యకు ప్రాధాన్యం



ప్రయోగశాలను ప్రారంభిస్తున్న ప్రిన్స్‌పాల్ ఎం.శ్యాంబాబు

పాలకొండ రూరల్: నేటి సమాజంలో సాంకేతికతతో కూడిన విద్యకు ఎంతో ప్రాధాన్యం ఉందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం.శ్యాంబాబు అన్నారు. 30 కంప్యూటర్లతో కూడిన ప్రయోగశాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కంప్యూటర్ విద్యపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి, ఐక్యూ కోఆర్డినేటర్ బి.రాజు, సీహెచ్ రాఘవేంద్ర, తదితరులున్నారు.

సామర్థ్యాలు మెరుగుపరిచేలా బోధన



మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రశేఖర్

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ బి.చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని దుడ్డుఖల్లు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో సోమవారం దుడ్డుఖల్లు, రేగిడి, టిక్కబాయి, దొరజమ్ము స్కూల్ కాంప్లెక్స్‌లకు చెందిన ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యా విధానంలో సాంప్రదాయ బోధనా పద్ధతులపై మాత్రమే ఆధారపడకుండా కేంద్రీకృత అభ్యాసన వ్యూహాలను అనుసరించాలని, విద్యార్థులకు విమర్శనాత్మక ఆలోచనలు, సమస్యలు, వాటి పరిష్కారం గూర్చి ఆలోచించే అభ్యాసన విధానాలను నేర్పించాలంటూ సూచించారు. అనంతరం రిసోర్స్ పర్సన్లు పాలక దేవానంద్, కృష్ణారావు ఉపాధ్యాయులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

అటవీ మంటల నివారణకు సహకరించాలి

గుమ్మలక్ష్మీపురం:



రాయగడ జమ్ములో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ సిబ్బంది

వేసవిలో అటవీ మంటలు నివారించేందుకు పోడుభూములు సాగు చేస్తున్న గిరిజన రైతులు సహకరించాలని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జి.నీలామణి కోరారు. మండలంలోని కర్లగూడ, రాయగడజమ్ము, కుడ్డ గ్రామాల్లోని గిరిజనులకు అటవీ మంటల నివారణపై సోమవారం అవగాహన కల్పించారు. పోడు భూమి సాగుపేరుతో అటవీ ప్రాంతంలో మంటలు వేయడం వల్ల పక్కనే ఉన్న తుప్పలకు మంటలు అంటుకుని మొత్తం అటవీ ప్రాంతానికి విస్తరించే అవకాశం ఉందన్నారు. పిచ్చిమొక్కలు, ఎండిన ఆకులను, కొమ్మలను ఎక్కడ పడితే అక్కడ మంటపెట్టకుండా ఖాళీ ప్రదేశానికి తీసుకువెళ్లి మంటపెట్టాలని, అవి పూర్తిగా కాలిన తరువాత మంటలను ఆర్పివేయాలని సూచించారు. అటవులు నాశనమైతే మానవాళి మనుగడకే ముప్పు వాటిల్లుతుందన్నారు. ఆయన వెంట ఫారెస్టు సిబ్బంది పి.ప్రసాద్, పోలిరాజు, కరుణాకరరావు ఉన్నారు.

వైభవంగా ఆలయ పునఃప్రారంభోత్సవం

గరుగుబిల్లి/జియ్యమ్మవలస:



రామమందిర పునఃప్రారంభోత్సవంలో పాల్గొన్న భక్తులు

జియ్యమ్మవలస మండలం పెదబుడ్డిడి గ్రామంలో సోమవారం శ్రీరామ మందిరం పునఃప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. వీరఘట్టంనకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో పునఃప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాసన, నవగ్రహ మండపారాధనలు, అర్చనలు, అగ్నిప్రతిష్ఠ ,గ్రామ ప్రదర్శన, జలాధివాసం తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామస్తులంతా పాల్గొని పూజలు చేశారు. మూడు రోజులపాటు పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బూత్ కన్వీనర్లు అప్రమత్తం

- ఎమ్మెల్యే కళావతి



బూత్ కన్వీనర్లుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: రానున్న ఎన్నికలు ఎంతో కీలకమని, బూత్ కన్వీనర్లు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సూచించారు. సీతంపేట మండలానికి చెందిన బూత్ కన్వీనర్లతో వండవ క్యాంప్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, టీడీపీ నేతలు దొంగ ఓట్లు చేర్పించడంతో పాటు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారని చెప్పారు. ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్ల మేలు జరిగితేనే మనకు ఓటు వేయమని అడగండని సూచించారు. కార్యక్రమంలో పాలకొండ ఏఎంసీ చైర్మన్ హిమరిక మోహనరావు, సీతంపేట ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు సవర రాము, చంద్రశేఖర్, సోమయ్య, సురాపాణి, కృష్ణ, సింహాచలం, వెంకటేష్ తదిరులున్నారు.

రాప్తాడు సభతో టీడీపీకి చెమటలు..

వీరఘట్టం: అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం సభ విజయవంతం కావడంతో టీడీపీకి చెమటలు పడుతున్నాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వండవలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేనివిధంగా సచివాలయం, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చారని కొనియాడారు. కరోనా సమయంలో దేశం అంతా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సంక్షేమ పథకాలు కొనసాగించిన సీఎం ఒక్క జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని చెప్పారు. మీకు మేలు జరిగితేనే మాకు ఓటు వేయండి అని ప్రజలను ఓటు అడిగే దమ్మున్న నాయకుడు మన ముఖ్యమంత్రి జగనన్న అని కొనియాడారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

జయకృష్ణా అసత్య ప్రచారాలు మానుకో..

- వండవ రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వండవ గ్రామ రైతులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు మోహనరావు, ఆదినారాయణ, తదితరులు

వీరఘట్టం: పాలకొండ టీడీపీ ఇన్‌చార్జ్ నిమ్మక జయకృష్ణ అసత్య ప్రచారాలు మానుకోవాలని వండవ గ్రామ రైతులు సూచించారు. సోమవారం వీరు విలేకరులతో మాట్లాడుతూ, వండవలో ఎమ్మెల్యే కళావతి 33 ఎకరాల చెరువును కబ్జా చేశారని ఇటీవల జయకృష్ణ చేసిన ఆరోపణలను ఖండించారు. 2014లో జయకృష్ణ ఓడిపోయినప్పటికీ అప్పటి సీఎం చంద్రబాబునాయుడు మాత్రం జయకృష్ణకు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారని, అప్పటి నుంచి కూడా జయకృష్ణ పైరవీలు చేస్తూ ప్రజాధనం లూటీ చేశారని ఆరోపించారు. సంక్షేమ పథకాలు అమలులో కమీషన్లు.. నామినేటెడ్ పదవులకు కూడా అనుచరుల నుంచి ముడుపులు.. దేవదాయ, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవుల కేటాయింపుల్లో లక్షలాది రూపాయల వసూలు.. ఇలా చెప్పుకుంటే పోతే జయకృష్ణ అక్రమాలు ఎన్నో ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం టీడీపీ నాయకుల్లో చాలామంది జయకృష్ణకు వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో కండల వెంకటనాయుడు, విశ్వాసరాయి విజయకుమారి, గొర్లె నాగభూషణరావు, బలరాం పాల్గొన్నారు.

చరిత్రహీనుడిగా మిగిలిపోతావ్..

వీరఘట్టం: గిరిజన తెగల చరిత్ర తెలియకుండా మాట్లాడుతున్న టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిమ్మక జయకృష్ణ చరిత్రహీనుడిగా మిగిలిపోతాడని పాలకొండ ఏఎంసీ చైర్మన్ హిమరిక మోహనరావు అన్నారు. ఎమ్మెల్యే కళావతి ఇంటి పేరుపై జయకృష్ణ ఇటీవల చేసిన ఆరోపణలను మోహనరావు తీవ్రంగా ఖండించారు. వండవలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీతంపేట ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ, గిరిజన సంఘ నాయకులతో కలసి సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇంటిపేరు కుల నిర్ధారణకు కొలమానం కాదన్న విషయం జయకృష్ణ తెలుసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే ఇంటిపేరైన విశ్వాసరాయి తమకులంలో లేదని, ఆమె ఎస్టీ అవునో, కాదో కళావతి చెప్పాలని జయకృష్ణ విమర్శలు చేయడం అయన అజ్ఞానానికి నిదర్శనమన్నారు. కొండగొర్రి అనే ఇంటి పేరు విశ్వసరాయిగా.. కొలక అనే ఇంటి పేరు కీర్తిరాయిగా.. బిడ్డిక అనే ఇంటి పేరు గుండెలగా.. ఇలా పలు గిరిజన కుటుంబాలు ప్రత్యేక గుర్తింపు పొందిన విషయం ముందు తెలుసుకోవాలని హితవు పలికారు. వండవ మాజీ సర్పంచ్ విశ్వాసరాయి విజయకుమారి మాట్లాడుతూ, ఎమ్మెల్యే కళావతిని రాజకీయంగా ఎదుర్కోలేక టీడీపీ నేత నిమ్మక జయకృష్ణ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో గిరిజన సంఘ నాయకులు సవర రాము, చంద్రశేఖర్, సోమయ్య, సురాపాణి, కృష్ణ, సింహాచలం, వెంకటేష్, సిమ్మయ్య, నాగరాజు, తదిరులున్నారు.

మెరుగైన బోధన అందించాలి

పాలకొండ రూరల్: ప్రభుత్వం సమకూరుస్తున్న వనరులను సద్వినియోగపర్చుకుని విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని ఎంఈఓ కె. సోంబాబు అన్నారు. మండలంలోని తంపటాపల్లి ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యసనాభివృద్ధి, డిజిటల్, సాంకేతిక విధానంలో తరగతులు నిర్వహించడంపై అవగాహన కల్పించారు.

